క్లుప్తంగా

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

తిరువూరు: మహాశివరాత్రి సందర్భంగా తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి పలు శైవ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సుసర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గుట్టపాడు, నీలాద్రి శైవక్షేత్రాలకు బుధవారం ఉదయం 5 గంటల నుంచి ప్రతి 20 నిముషాలకు ఒక బస్సు చొప్పున నడుపుతున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించాలి

ఆగిరిపల్లి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సోమవారం ప్రజా సంఘాల నాయకులు మండలంలోని సీతారామపురం, నుగొండపల్లి, తోటపల్లి, ఈదర, ఎస్ఏ పేటలో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చాకిరి శివ నాగరాజు, ముత్యాల నరేష్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జవహర్ లాల్ నెహ్రూ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే డు చాంపియన్ షిప్– 2025 పోటీల్లో కొండపల్లి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని పాఠశాల హెచ్‌ఎం అండాళ్లు సోమవారం తెలిపారు. చిలకలూరిపేట శ్రీ వెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన కటా విభాగంలో షేక్ ఫరీదా సుల్తానా 15 ఏళ్ల క్యాటగిరిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. 14 ఏళ్ల విభాగంలో ఎండీ యూసుబ్ ద్వితీయ, పఠాన్ ఇలియాస్ తృతీయ బహుమతి అందుకున్నారు. నీలం సందీప్ 13 ఏళ్ల కేటగిరీలో ద్వితీయ, 9 ఏళ్ల విభాగంలో షేక్ ఫౌజియా ద్వితీయ బహుమతి పొందారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విజేతలను కరస్పాండెంట్ ఎస్‌వీఎస్‌ఎస్ ప్రసాద్, కోచ్ మురళి, అభినందించారు.

త్రో బాల్ విన్నర్‌గా మర్లపాలెం హైస్కూలు

చాట్రాయి: నూజివీడు సబ్‌జోన్ త్రో బాల్ విన్నర్‌గా మండలంలోని మర్లపాలెం హైస్కూలు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఆగిరిపల్లి మండలంలో ఈ నెల 21, 22న నిర్వహించిన పోటీల్లో బాలికల విభాగంలో విన్నర్‌గా బాలుర విభాగంలో ద్వితీయ స్థానం పొందారు. విజేతలను హెచ్‌ఎం ఎ.బక్కయ్య, పీఈటీ సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

56 మంది విద్యార్థుల ఎంపిక

విస్సన్నపేట: స్థానిక వికాస్ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో వికాస్ పీజీ, ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో నిర్వహించిన ఎంపికల్లో 56 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. హెటిరో సంస్థ క్వాలిటీ మేనేజర్ సుబ్రహ్మణ్యం, హెచ్.ఆర్ దుర్గాప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చల్లా సుధీర్‌రెడ్డి, ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరావు, రమేష్, బీ తిరుమలేశ్వరరావు, వీరబాబు, వెంకట్ పాల్గొన్నారు.

బలివే ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

నూజివీడు: ముసునూరు మండలం బలివేలో శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ నేతృత్వంలో మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలను తీసుకున్నారు. ఈ నెల 25 సాయంత్రం నుంచి 27 ఉదయం వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

బందోబస్తులో 334 మంది సిబ్బంది..

బలివేలో 334 మందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. డీఎస్పీ నేతృత్వంలో సీఐలు ముగ్గురు, ఎస్సైలు 10 మంది, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు మొత్తం కలిపి 200 మంది, ఎన్‌సీసీ క్యాడెట్స్ 70 మంది, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది 50 మందిని బందోబస్తుకు నియమించారు. వీరు ఆలయ పరిసరాల్లో తోపులాటలు లేకుండా చూడటం, బారికేడ్ల ద్వారా భక్తులను స్వామి వారి దర్శనానికి పంపించడం తదితర బాధ్యతలను నిర్వర్తిస్తారు.

నేడు బాలిరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ

మైలవరం: ప్రవాసాంధ్రులు, విద్యా ప్రదాత దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి కాన్స్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామం ప్రధాన కూడలిలో ఆయన కుటుంబ సభ్యులచే ఏర్పాటు చేసిన దివంగత లకిరెడ్డి బాలిరెడ్డి కాంస్య విగ్రహాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆవిష్కరిస్తారన్నారు. అభిమానులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

- రేపు మహాశివరాత్రి
- ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఆలయాల సందర్శనకు సిద్ధపడుతున్న భక్తులు

మైలవరం: మండలంలోని వెల్వడం గ్రామంలో శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం ఈ నెల 26న మహాశివరాత్రి పండుగకు ముస్తాబయింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక్కడకు మండల ప్రజలే గాక తిరువూరు, గంపలగూడెం, మధిర, కొండకూరు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామివార్లకు మొక్కులు చెల్లించుకుంటారు.



వెల్వడం గ్రామంలోని శ్రీబాల కోటేశ్వరస్వామి ఆలయం

మూడు రోజుల పండుగ..

వెల్వడం శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పండుగను గ్రామస్తులు మూడు రోజులు పాటు జరుపుకుంటారు. మొదటి రోజు ఉదయం కోనేటి స్నానాలతో తిరునాళ్ల ప్రారంభమవుతుంది.

మొదటి రోజు గ్రామంలో భారీ స్థాయిలో ప్రభలను అలంకరించి రహదారిలో ఊరేగిస్తూ ఆలయం వరకు తరలిస్తారు. రెండవ రోజు రథోత్సవం. శ్రీస్వామివార్లను రంగు రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళతారు. మూడవ రోజు తిరునాళ్ల ముగింపు..

ముగింపు కార్యక్రమంలో భాగంగా దేవతా విగ్రహాలను ఊరేగించి, అయ్యగారి మఠంలో ఉంచుతారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే తిరునాళ్లలో వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. చిన్నారులను వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ఈ మూడు రోజులు వెల్వడం గ్రామ ప్రముఖులచే భక్తులకు పులిహోర, తాగునీరు పంపిణీ జరుగుతుంది. ఈ పండుగకు విదేశాలలో ఉన్న సుమారు 2000 మంది ప్రవాసాంధ్రులు హాజరై తమ భక్తిప్రపత్తులు చాటుకుంటారు.



వెల్వడం శివాలయం వద్ద భక్తుల స్నానాలకు సిద్ధం చేసిన కోనేరు



వెల్వడంలో ఊరేగింపునకు సిద్ధంగా ప్రభలు

ఆలయ చరిత్ర ఇదీ..

వెల్వడం గ్రామానికి చెందిన నాటి ప్రముఖులు దివంగత యరమల కృష్ణారెడ్డికి భగవంతుడు (బాలకోటేశ్వర స్వామి) కలలో కన్పించి నేను నీకు చూపిన దారిలో, నేను చెప్పిన చోట గుడి కట్టించాలని వాక్కు ఇచ్చారట. ఇయన చూపిన దారిని తెలుసుకొనుటకు పాదముద్రలు కన్పించాయట. ఆ పాద ముద్రలు నేటికీ సాక్ష్యముగా ఆలయ సమీపంలో ఉండటం విశేషం. ఆ ప్రకారం సుమారు 170 సంవత్సరాల క్రితం దివంగత యరమల కృష్ణారెడ్డి స్వయంగా గానుగ సున్నం, చేతి సున్నం ముద్దల ద్వారా శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని గ్రామ పెద్దల సహకారంతో నిర్మించారు. ఈ ఆలయానికి 1.5 ఎకరాలు పొలం ఉంది. తరువాత కృష్ణారెడ్డి వారసులు నాగిరెడ్డి, గంగాధరరెడ్డి, ఈ విధంగా వారి వంశీకులు వారి స్థాయిని బట్టి తిరునాళ్ల నిర్వహిస్తూ వచ్చారు. ఆలయ సమీపంలో భక్తుల స్నానాల సౌకర్యార్థం లకిరెడ్డి పాపులమ్మ కోనేరు తవ్వించారు. ఈ కోనేరు బాగోగులు నేటికి లకిరెడ్డి సోదరులు చూస్తూ ఉంటారు. మొదటి రోజు ఇక్కడే స్నానాదులు ఆచరించి, పెద్దలకు పిండప్రదానాలు చేస్తుంటారు. మహిళలకు ప్రత్యేకంగా స్నానాలకు ఏర్పాటు చేశారు. 2002లో లకిరెడ్డి బాలిరెడ్డి సోదరులు లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి అన్నపూర్ణమ్మల సౌజన్యంతో రూ.20 లక్షల వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టి పూజారులను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దివంగత తల్లపురెడ్డి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం సతీమణి భారతమ్మ ఆలయం సమీపంలో నవగ్రహాల ఆలయాన్ని నిర్మించారు. అనంతరంవెల్లంకి శ్రీనివాసరావు నాగేంద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు.

సేవా కార్యక్రమాలు..

లకిరెడ్డి సోదరులు శివరాత్రికి పేదలు, వికలాంగులకు నూతన వస్త్రాలు, పేదలకు, వృద్ధులకు పింఛన్‌లు పంపిణీ చేస్తారు. గ్రామస్తులందరూ ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని ఉల్లాసంగా నిర్వహిస్తారు. మూడు రోజులు తిరునాళ్లలో రోజూ కోలాటం, భజనలు, నాటకాలు, డ్యాన్స్ తదితర సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తిరువూరు: మహాశివరాత్రి పర్వదినానికి తిరువూరు నియోజకవర్గంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. 150 సంవత్సరాల క్రితం నిర్మించిన తిరువూరులోని శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, విజయవాడ రోడ్డులోని గౌరీ కేదారేశ్వరాలయాలలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, పార్వతీ పరమేశ్వర కల్యాణం తదితర కార్యక్రమాలను ఈ నెల 26న నిర్వహించనున్నారు. విస్సన్నపేటలోని శివాలయం, కొండపర్వ, పుట్రేల గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తకమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. గంపలగూడెం మండలం మేడూరు, పెనుగొలను, గంపలగూడెంలలో ఏకొండూరు మండలంలోని కంభంపాడు, గోపాలపురం గ్రామాల్లో, తిరువూరు మండలంలోని పెద్దవరం, మునుకుళ్ల, మల్లేల గ్రామాల్లో కూడా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి.



విస్సన్నపేట మండలం కొండపర్వలోని శివాలయం



తిరువూరు శ్రీచంద్రమౌళీశ్వరాలయం

అమృతలింగేశ్వరునికి నాలుగు రోజులు ఉత్సవం

జి.కొండూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు జి.కొండూరు పార్వతీ సమేత అమృతలింగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబవుతోంది. నాలుగురోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 26న మొదటిరోజు అభిషేకాలు, ప్రభోత్సవం, కోలాట విన్యాసాలు, కల్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ అభిషేకాలు జరుగనున్నాయి. రెండో రోజు 27న సాయంత్రం 5.30గంటలకు పార్వతీ సమేత అమృతలింగేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం, అనంతరం మ్యూజికల్ నైట్. మూడో రోజు 28న భక్తి గీతాలాపనలు, లక్కీడ్రాలో ఎంపిక కాబడిన విరాళ దాతలకు సత్కారం జరుగుతుంది. నాల్గవ రోజు మార్చి ఒకటిన సత్య హరిశ్చంద్ర ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనతో ఉత్సవాలు ముగుస్తాయి. దేవాలయం వద్ద జల్లు స్నానం, పిండ ప్రధాన క్రతువులకు పండితులను కూడా నియమించామని ఉత్సవ కమిటీ పేర్కొన్నారు.



జి.కొండూరులో పార్వతీ సమేత అమృతలింగేశ్వరస్వామి దేవాలయం

తిరువూరు: మహాశివరాత్రి పర్వదినానికి తిరువూరు నియోజకవర్గంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. 150 సంవత్సరాల క్రితం నిర్మించిన తిరువూరులోని శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, విజయవాడ రోడ్డులోని గౌరీ కేదారేశ్వరాలయాలలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, పార్వతీ పరమేశ్వర కల్యాణం తదితర కార్యక్రమాలను ఈ నెల 26న నిర్వహించనున్నారు. విస్సన్నపేటలోని శివాలయం, కొండపర్వ, పుట్రేల గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తకమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. గంపలగూడెం మండలం మేడూరు, పెనుగొలను, గంపలగూడెంలలో ఏకొండూరు మండలంలోని కంభంపాడు, గోపాలపురం గ్రామాల్లో, తిరువూరు మండలంలోని పెద్దవరం, మునుకుళ్ల, మల్లేల గ్రామాల్లో కూడా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి.

సంసోను కుటుంబానికి న్యాయం కోరుతూ ఆందోళన

మైలవరం: మండలంలోని మొర్సుమల్లి గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసుకు సంబంధిచి మొదట పోలీసులు అనుమానితుడిగా గుర్తించి గ్రామానికి చెందిన సంసోను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తదనంతరం అసలు నిందితుడు మృతుని కొడుకేనని నూతన టెక్నాలజీ ద్వారా తెలుసుకున్న పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా ఉన్న సంసోనును నిర్దోషిగా విడుదల చేసిన విషయం విధితమే. కాగా పోలీసులు సంసోనును అక్రమంగా అరెస్టు చేసి వేదనకు గురిచేశారంటూ సీఐ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎఫ్ఐఆర్‌లో అసలు ముద్దాయిని గుర్తించి పోలీసులు అతనిని అరెస్టు చేశారు. అయితే సంసోనును పోలీసులు తీవ్రంగా హింసించారంటూ సోమవారం మైలవరం పోలీస్ స్టేషన్ వద్ద తిరిగి ఆందోళన చేపట్టారు. సంసోను కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని, సంబంధిత పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోటా డానియేల్ మాదిగ, మందా వెంకటేశ్వరరావు, ఇంకొల్లు జమలయ్య, ఆలూరి నాగమల్లేశ్వరరావు, మందా పిచ్చయ్య, ఎలీషా, బుద్దే యోహాన్, పి.యేసురత్నం తదితరులు పాల్గొన్నారు. ఆందోళన కార్యక్రమం రాత్రి వరకు కొనసాగింది.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు

ఎన్టీటీపీఎస్ సీఈకి ఉద్యోగుల సత్కారం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఒకరోజు అత్యధిక విద్యుత్ ఉత్పాదన సాధించిన సందర్భంగా ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, జెన్‌కో రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలతో సీఈని ఘనంగా సత్కరించారు. సీఈ నాగరాజు నేతృత్వంలో ఎన్టీటీపీఎస్ సంస్థ తన రికార్డులు తానే తిరగరాస్తోందని అమర్‌నాథ్ తెలిపారు. రెండు రోజుల కిందట 52.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పాదనతో ఆల్‌టైమ్ రికార్డు సాధించడం సంస్థకు గర్వకారణం అన్నారు. ఈ ఘనత సాధించడంలో ప్రతి ఒక్క ఉద్యోగి, కార్మికుల శ్రమ దాగి ఉందని సీఈ నాగరాజు అన్నారు. వారందరికీ అభినందనలు తెలియజేశారు. జెన్‌కో రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యప్రసాద్, పాపారావు, డీఈ విజయకుమార్, ఏడీ రవికుమార్, కోశాధికారి మణిబాబు, లత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు



ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్‌లో తోపుడు బండ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నవారి పొట్ట కొట్టొద్దని సీఐటీయూ, సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పోలీసులు, మున్సిపాలిటీ అధికారుల తీరును ఆక్షేపించారు. తోపుడు బండ్లు తొలగించినందుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆక్రమణల పేరుతో చిరువ్యాపారాలు తొలగించడం అన్యాయమని నినాదాలు చేశారు. పేదల దుకాణాలు తొలగించే ముందు వారికి మరోచోట స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు ఆలేటి విఠలరావు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గతంలో చిరువ్యాపారుల ఆశీలు రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. ఇప్పుడు దుకాణాలు తొలగిస్తుంటే ఒక్కమాట మాట్లాడడం లేదని విమర్శించారు. ట్రాఫిక్ నియమావళి కింద దుకాణాలు తొలగిస్తే హైవే పక్కన ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రింగ్ సెంటర్‌లో పెత్తందారులు, వారి కార్లు తప్ప పేదలు కనిపించకూడదనే ఎత్తుగడతోనే ఈ కుతంత్రానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇళ్లల్లో ప్రతిరోజు ఊడ్చుతుంటే బూడిద వస్తుందన్నారు. తాగునీటిలో సైతం బూడిద కలిసి కలుషిత నీరు తాగుతూ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులు పాల్గొన్నారు.

● సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

చాట్రాయి: సూపర్ సిక్స్ హామీలను నేరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ తెలిపారు. సోమవారం చాట్రాయిలో ఆ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేయాలని కోటపాడు, చీపురుగూడెం, మర్రిబంధం గ్రామాల్లో 51 ఎకరాలకు డి-ఫారం పట్టాలు ఇచ్చి లబ్ధిదారులకు అప్పగించేందుకు జాయింట్ సర్వే చేపట్టాలని ఆ శాఖ ఏరియా కమిటీ అధ్యక్షుడు దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. మిర్చి పంటకు గిట్టుబాటు ధరకల్పించ లేక ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆయన ఆరోపించారు. అర్హత కలిగిన వారికి ఇంటి స్థలం, ఇల్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చాట్ల బాబూరావు, తిరపతిరావు, రాముడు, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

● పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

తిరువూరు: స్థానిక నాగార్జున స్కూలులో పదో తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ డీ హనుమంతరావు పాల్గొన్నారు. ఉన్నత విద్యకు, ఉద్యోగాలకు పదో తరగతి మార్కులే గీటురాయిగా ఉంటాయని, ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారు మంచి అవకాశాలు పొందవచ్చని ఆయన సూచించారు. కరస్పాండెంటు వేమూరి నాగేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావు, డైరెక్టర్ సూరిబాబు, హైస్కూల్ ప్రిన్సిపాల్ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శన లిచ్చారు.

● పరుగుపందెంలో విద్యార్థి ప్రతిభ

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గోపు విజయ్‌కుమార్ ఏలూరు జిల్లా స్థాయి 100 మీటర్ల పరుగుపందెం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించాడు. దీంతో అతడిని జిల్లా క్రీడాధికారి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ అలివేలు, వ్యాయామోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, సబ్‌జోన్ సెక్రటరీ శివ నగేంద్రరావు, సీనియర్ పీడీ దాసరి శ్రీహర్షలు ప్రతిభ కనబరిచిన విద్యార్థితో పాటు శిక్షణనిచ్చిన పీడీ పి.రవీంద్రను సోమవారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు.

● 10 మందికి వీల్ చైర్లు అందజేత

ఆగిరిపల్లి: స్థానిక భవితా కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు దాతల సహకారంతో వీల్ చైర్లు అందజేశారు. విజయవాడకు చెందిన ప్యూర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో 10 మంది దివ్యాంగ విద్యార్థులకు వీల్ చైర్లను బహూకరించారు. సంస్థ ప్రతినిధులను ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ప్యూర్ సంస్థ ప్రతినిధి డి.అంకరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ దుర్గ, ఉపాధ్యాయులు ఝాన్సీ రాణి, రజిని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● వైభవంగా వరప్రసాద మాత ఉత్సవాలు

ఆగిరిపల్లి: మండలంలోని రాజవరంలో వరప్రసాద మాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ జయరాజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: స్థానిక ఎక్సైజ్ స్టేషను పరిధిలోని గంపలగూడెం మండలంలో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. కొత్తపల్లిలో సారా తయారీకి సిద్ధంచేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను అధికారులు ధ్వంసంచేశారు. విస్సన్నపేట మండలం, వేమిరెడ్డిపల్లి శివారు గాజుల చెరువు వద్ద మరో 500 లీటర్ల బెల్లపు ఊటను కూడా ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.

● సబ్‌జోన్ త్రోబాల్ రన్నర్స్‌గా ముసునూరు హైస్కూల్

ముసునూరు: సబ్‌జోన్ త్రోబాల్ పోటీల్లో తమ విద్యార్థినులు ద్వితీయస్థానం సాధించినట్లు ముసునూరు జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్.ఎం వాణికుమారి తెలిపారు. ఇటీవల ఆగిరిపల్లిలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినుల జట్టు అసమాన ప్రతిభ కనబరిచి త్రోబాల్ రన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను, పీఈటీలు హేమాదేవి, ఆలీఖాన్‌లను ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు యువరాజు, ఫ్రాన్సిస్, నాగేశ్వరరావు, రమణ, మాణిక్యాలరావు తదితరులు అభినందించారు.

● బీజేపీ పట్టణ కమిటీ ఏర్పాటు

నూజివీడు: బీజేపీ పట్టణ నూతన కమిటీని అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి సోమవారం ప్రకటించారు. బాపూనగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన కార్యదర్శులుగా దోసపాటి మల్లిఖార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్, కార్యదర్శులుగా వరాటి బాలు, పులిపాక విజయలక్ష్మి, మాగంటి వాణి, జూనుపూడి ప్రతాప్, సీహెచ్ సూర్య ప్రకాష్‌కుమార్, కోశాధికారిగా పరిసే శ్రీనివాస కుమార్ నియమితులయ్యారు. అనుబంధ విభాగాలైన ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా జూట్రు భూపతిరావు, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా షేక్ బాజీమా, యువమోర్చా అధ్యక్షుడిగా చిట్టుమూరి భద్రం, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా షేక్ రఫీబాబు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా చింతల సంజయ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బాణావతు క్రాంతి నాయక్‌లు నియమితులయ్యారు. నాయకులు బోను అప్పారావు, వైఎస్ దొరై, మాటూరి రవికాంత్, ఎం రాజశేఖర్, భావరాజు పుల్లారావు, వసుంధరాదేవి, మాగంటి వాసు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● 'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ముసునూరు: విద్యతోనే మనిషి నిజమైన ఉన్నతుడు కాగలడని హెచ్‌ఎం అబ్బాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు, పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలతో వీడ్కోలు పలికి, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం చెక్కపల్లి సంక్షేమ సంఘం ప్రతినిధులు పదో తరగతి విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్ఎంసీ చైర్మన్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు పద్మకిషోర్, రాజశేఖర్, సత్యనారాయణ, విజయానంద్, జోసఫ్, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలి

చాట్రాయి: సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేస్తున్న సర్వేలపై సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమలు, హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్, మిస్సింగ్ సిటిజన్స్, పీఏసీఎస్‌లపై నిర్వహిస్తున్న సర్వేలను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కమల్ విష్ణు పాల్గొన్నారు.

● కేసు నమోదుపై బాధితుల ఆవేదన

నూజివీడు: తమ ఇంటి స్థలంలో నుంచి దారి కావాలంటూ గత కొద్ది రోజులుగా తమను బెదిరిస్తూ ఒత్తిడి చేస్తూ ఇబ్బంది పెడుతున్న వారిపై పోలీసులు కేసు పెట్టకుండా తమపై తప్పుడు కేసు నమోదు చేయడంపై మండలంలోని దేవరగుంటకు చెందిన వంకాయల రంగమ్మ వర్గీయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇంటి వెనుక ఉన్న పరికల వెంకటేశ్వరరావు అనే అతను గత కొన్నాళ్లుగా తన ఇంటికి దారి కావాలంటూ రంగమ్మపై ఒత్తిడి చేసి, గొడవ పడుతున్నాడని రంగమ్మ కుమారుడు ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. సెంటున్నర స్థలంలో రంగమ్మకు ఇల్లు ఉందని, అందులో నుంచి దారి ఇవ్వడానికి కుదరదని గ్రామంలోని పెద్దలు కూడా చెప్పారని, అయినా తమపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రంగమ్మ తన స్థలం వరకు చుట్టూ ఆదివారం పట్టాలు కట్టుకుంటుంటే వెంకటేశ్వరరావు ఆయన భార్యను, అక్కను పంపి గొడవ పెట్టుకున్నారని, అనంతరం భార్య, అక్క ఆసుపత్రిలో చేరారన్నారు. ఆసుపత్రిలో ఉండి తమ వర్గానికి చెందిన 11 మందిపై వెంకటేశ్వరరావు అక్క పరసా వెంకటేశరమ్మ తప్పుడు ఫిర్యాదు చేస్తే గ్రామంలో ప్రాథమిక విచారణ కూడా చేయకుండా కేసు కట్టారని వాపోయారు. వాళ్లు కేసు పెట్టిన కొద్దిసేపటికే తాము కేసు పెడితే మేము పెట్టిన కేసును రిజిస్టర్ చేయడం లేదన్నారు. తమపై మంత్రి ఒత్తిడి ఉందని, అందుకే కేసు కట్టామని చెబుతున్నారని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే తాము జిల్లా ఎస్పీని కలిసి వాస్తవాలను తెలిపారని పేర్కొన్నారు.